తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం - 1 - జూన్ - 2026 | సంపుటి : 3 | సంచిక : 364 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# వరుసగా రెండోసారి ఐపీఎల్ ఛాంపియన్‌గా ఆర్సీబీ



**డెస్క్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):**

ఐపీఎల్-19 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్‌లో గుజరాత్‌పై ఆ జట్టు 5 వికెట్ల తేడాతో నెగ్గి వరుసగా రెండోసారి టైటిల్ సాధించింది. 156 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో విరాట్ కోహ్లీ (75*; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగాడు. వెంకటేశ్ అయ్యర్ (32; 16 బంతుల్లో 4 పోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (24; 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రజత్ పాటీదార్ (15), జితేశ్ శర్మ (11) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 2, సిరాజ్, రబాడ, అర్షద్ ఖాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ (50*; 37 బంతుల్లో) అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. ఓపెనర్లు సాయి సుదర్శన్ (12), శుభ్‌మన్ గిల్ (10) విఫలమయ్యారు. వన్‌డౌన్‌లో వచ్చిన నిశాంత్ సింధు (20) పరుగులు చేసి వెనుదిరిగాడు. జోస్ బట్లర్ (19) కూడా క్రీజులో ఎక్కువసేపు నిలవలేకపోయాడు. అర్షద్ ఖాన్ (15) రన్స్ చేశాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ 3, జోష్ హేజిల్‌వుడ్ 2, భువనేశ్వర్ కుమార్ 2, కృనాల్ పాండ్య ఒక్కో వికెట్ పడగొట్టారు.

## రక్తపరీక్షతో క్యాన్సర్ గుర్తింపు

### నిమ్స్‌లో కొత్త సాంకేతికత

### ఆరోగ్యశ్రీలో ఉచిత సేవలు.. రోగులకు భారీ ఊరట

**హైదరాబాద్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ నిర్ధారణ రంగంలో మరో కీలక ముందడుగు వేయడానికి సిద్ధమైంది. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి రోగులకు మరింత సమర్థవంతమైన చికిత్స అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక లిక్విడ్ బయాప్సీ పరీక్షలను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ సేవలను ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వెల్లడించారు. సాధారణంగా క్యాన్సర్ నిర్ధారణ కోసం కణితి నుంచి నమూనా సేకరించి టిష్యూ బయాప్సీ

మిగతా 2లో..






## రైతు డిస్కంపై కవిత ఆగ్రహం

- ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు
- ఈఆర్సీకి విజ్ఞప్తి చేసిన కవిత
- పాదయాత్ర హెచ్చరిక జారీ

**హైదరాబాద్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రైతు డిస్కం అంశంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, రైతు డిస్కం పేరుతో ప్రభుత్వం కొత్త విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు.

మిగతా 2లో..

## ఖర్గేను కలిసిన రేవంత్

### హైదరాబాద్‌లో నేతల భేటీ

### ఏఐసీసీ అధ్యక్షుడికి స్వాగతం.. కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

**హైదరాబాద్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ మీదుగా గుల్బర్గాకు వెళ్తున్న సందర్భంగా ఈ భేటీ జరిగింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సంపత్ కుమార్ తదితరులు ఖర్గేను కలిశారు. పార్టీకి సంబంధించిన పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో కొన సాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,

మిగతా 2లో..





## పోలీసులకు డీజీపీ దిశానిర్దేశం

- ఆరు వేల మందితో సమావేశం
- కొత్త సవాళ్లపై చర్చ
- ప్రజా భద్రతపై దృష్టి

**హైదరాబాద్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖలోని అన్ని విభాగాలకు చెందిన ఎస్సై స్థాయి నుంచి పైస్థాయి అధికారులతో విస్తృత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుమారు 6,500 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్, పోలీసు శాఖ ఎదుర్కొంటున్న మారుతున్న

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పోలీసులకు డీజీపీ దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు మావోయిస్టు సమస్యలు, సంప్రదాయ నేరాల నియంత్రణ ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసు శాఖ ఆలోచనా విధానం, పని తీరు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు. ఆధునిక సాంకేతికతలను వినియోగించేందుకు ప్రత్యేక సాంకేతిక బృందాలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఆదాయ లీకేజీల నియంత్రణకు విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్‌తో పాటు ఆహార కల్తీ నియంత్రణ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీలు, పోలీసు కమిషనర్లు తమ యూనిట్లకు నాయకులుగా వ్యవహరించాలని సీవీ ఆనంద్ సూచించారు. నేర సమీక్ష సమావేశాలు, పోలీస్ స్టేషన్ల తనిఖీలు, పగలు-రాత్రి గస్తీ, డయల్-112 అత్యవసర సేవలపై తక్షణ స్పందన వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలతో మరింత చేరువ కావడానికి రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రజా దర్శన సమయాలను అమలు చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులతో వ్యవహరించే సమయంలో కూడా విధి నిర్వహణ ప్రమాణాలను పాటించాలని పేర్కొన్నారు. స్టేషన్ హౌస్ అధికారులు, ఎస్సైలు, డీఎస్పీలు, అదనపు ఎస్పీలు, కమాండెంట్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని డీజీపీ సూచించారు. నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజా సేవా దృక్పథంతో పనిచేసినప్పుడే పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# రైతు డిస్కంపై కవిత ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంలను భవిష్యత్తులో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రణాళికలో భాగంగానే ఈ చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి విద్యుత్ రంగంలో మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రైతులపై భారం మోపే ఏ నిర్ణయాన్నైనా తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్ చాట్‌లలో చేస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లో ఉన్న అనుమానాలను మరింత పెంచుతున్నాయని కవిత అన్నారు. ఉచిత విద్యుత్ ఎత్తివేయబోమని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాటిని అధికారికంగా ప్రజల ముందుకు వచ్చి ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన అనేక హామీలు అమలు కాలేదని, అందువల్ల ఇప్పుడు చేస్తున్న ప్రకటనలపై రైతులు నమ్మకం ఉంచలేకపోతున్నారని పేర్కొన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, బోనస్ చెల్లింపులు, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులకు సంబంధించిన ప్రతి అంశంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రైతు డిస్కం ప్రతిపాదనపై విద్యుత్ నియంత్రణ మండలి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కవిత సూచించారు. రైతులకే సంబంధించిన అంశం కాబట్టి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. రైతులకు నష్టం కలిగించే అవకాశం ఉన్న ఈ ప్రతిపాదనకు ఈఆర్సీ అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో తీసుకునే నిర్ణయాలు లక్షలాది మంది రైతుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని గుర్తుచేశారు. అందువల్ల పారదర్శకంగా వ్యవహరించి రైతుల అభిప్రాయాలను గౌరవించాలని కోరారు. ఈ అంశంపై ఇప్పటికే తెలంగాణ జాగృతి తరఫున న్యాయపోరాటం ప్రారంభించినట్లు కవిత వెల్లడించారు. రైతు డిస్కానికి అనుమతి లభిస్తే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ చర్యనైనా అడ్డుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలో రైతులకు నష్టం కలిగించే విధానాలను సహించబోమని అన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలే తమ పోరాటానికి ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో తీసుకొస్తున్న విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని కవిత ఆరోపించారు. ముఖ్యంగా సోలార్ ప్యానెల్లు, బ్యాటరీల తయారీ రంగంలో చిన్న, మధ్య తరహా సంస్థలకు తీవ్ర నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కొత్త నిబంధనల వల్ల కొద్దిమంది పెద్ద పారిశ్రామిక వర్గాలకు మాత్రమే లాభం చేకూరుతుందని, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. లక్షలాది మంది ఉపాధిపై ప్రభావం చూపే ఇటువంటి నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్న వ్యాపారులు చేపట్టే ఉద్యమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని కూడా కవిత ప్రభుత్వాన్ని కోరారు. దసరా పండుగ లోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. అదే సమయంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స సమయంలో చేయి కోల్పోయిన చిన్నారి ఘటనపై కూడా ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని, చిన్నారి పేరిట రూ.25 లక్షల నిధిని డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, రైతు సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు.




# జూనియర్ కళాశాల పనుల పరిశీలన

- రూ.6 కోట్లతో నిర్మాణం
- పురోగతిపై మంత్రి సమీక్ష
- విద్యా వసతులపై ప్రత్యేక దృష్టి



**నల్గొండ, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల స్థితిగతులపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలతో భవనాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణయించిన గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి కళాశాల భవనాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు. పనుల్లో జాప్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన అన్ని వనరులను వినియోగించి పనులు వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా పట్టణ స్థాయి విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యా రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆధునిక సదుపాయాల కల్పన ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. కొత్త భవనాలు, తరగతి గదులు, ఇతర సౌకర్యాల అభివృద్ధి ద్వారా విద్యా ప్రమాణాలను పెంచుతున్నామని వివరించారు. ఈ కళాశాల భవనం పూర్తయితే కనగల్ మండలంతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- సమ్మర్ క్యాంప్ ముగింపు
- విద్యార్థులకు ఈటల సూచనలు
- చదువుతో పాటు క్రీడలు



**హైదరాబాద్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్-2026 ముగింపు కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించి ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఈటల రాజేందర్, ప్రస్తుత కాలంలో విద్యార్థుల జీవితం చదువులకే పరిమితమైపోతోందని అన్నారు. మార్కులు సాధించడం మాత్రమే విద్య లక్ష్యం కాదని, జీవితంలో తమ కాళ్లపై తాము నిలబడేలా చేసే విద్య అవసరమని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసానికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని వివరించారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని క్రీడలు అందిస్తాయని చెప్పారు. అందుకే ప్రతి విద్యార్థి క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయాన్ని సద్వినియోగం చేసే ఉద్దేశంతో ఈ క్రీడా శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శిక్షకులు, నిర్వాహకులు, అధికారులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని ఈటల రాజేందర్ తెలిపారు. ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ప్రపంచ క్రీడా వేదికలపై భారత్ మరింత మెరుగైన స్థానం సాధించే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లు, టెలివిజన్లు, కంప్యూటర్లకు మాత్రమే పరిమితం కాకుండా ఫుట్‌బాల్, కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అజిలాపూర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన



- రూ.32 కోట్లతో నిర్మాణం
- 1400 ఎకరాలకు సాగునీరు
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం
- మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి

**మహబూబ్‌నగర్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అజిలాపూర్ గ్రామంలో నిర్మించనున్న అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.32.05 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ వ్యవసాయ రంగానికి ఊతం లభించనుంది. అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయిన అనంతరం మూడు గ్రామాల పరిధిలోని సుమారు 1,400 ఎకరాల భూమికి సాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది. దీంతో ఎన్నో సంవత్సరాలుగా సాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు గణనీయమైన ప్రయోజనం చేకూరనుంది. భూగర్భ జలాలపై ఆధారపడే పరిస్థితి తగ్గి వ్యవసాయ ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నీటిపారుదల రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు స్థిరమైన సాగునీటి వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నిలిచిపోయిన ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి కీలక ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి అభివృద్ధి, క్రీడలు-యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు కీలకమని అన్నారు. నీటి లభ్యత పెరిగితే రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయితే ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన గడువులోపు ప్రాజెక్టు పనులు పూర్తి కావాలని కోరారు.

# ఖర్గేను కలిసిన రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై కూడా నాయకులు ఖర్గేకు వివరించినట్లు తెలుస్తోంది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పార్టీ బలోపేతంతో పాటు రాబోయే రాజకీయ పరిణామాలపై కూడా నేతల మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ మరింత బలపడేలా చేపట్టాల్సిన చర్యలపై అభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గేతో రాష్ట్ర నాయకత్వం సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికాలేదు.

# రక్తపరీక్షతో క్యాన్సర్ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తారు. అయితే లిక్విడ్ బయాప్సీ విధానంలో కేవలం రక్త నమూనా ద్వారానే క్యాన్సర్ కణాలకు సంబంధించిన జన్యు సమాచారాన్ని విశ్లేషించవచ్చు. దీనివల్ల శస్త్రచికిత్స అవసరం లేకుండానే వ్యాధి స్థితి, తీవ్రతను అంచనా వేయడం సాధ్యమవుతుంది. నిమ్స్ పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్ జి ఉప్పిన్ తెలిపిన వివరాల ప్రకారం, రక్తంలో ఉండే క్యాన్సర్ కణాల డీఎన్ఏను పరిశీలించడం ద్వారా వ్యాధి వ్యాప్తి స్థాయిని గుర్తించవచ్చు. దీంతో రోగులకు తక్కువ ఇబ్బందితోనే ఖచ్చితమైన నిర్ధారణ అందే అవకాశం ఉంటుంది. ఆధునిక వైద్య రంగంలో ఇది అత్యంత ప్రగతిశీల సాంకేతికతగా గుర్తింపు పొందుతోంది.

ఇప్పటికే నిమ్స్‌లోని క్యాన్సర్ జీనోమిక్స్ కేంద్రంలో నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ సాంకేతికతతో ప్రత్యేక సేవలు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ డైమండ్ ప్రాజెక్టు కింద ఈ సేవలు ప్రారంభమయ్యాయి. క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యు మార్పులను గుర్తించడం ద్వారా రోగికి అనుకూలమైన లక్ష్య చికిత్సను ఎంపిక చేయడంలో ఈ పరీక్షలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2024 నుంచి ఇప్పటివరకు సుమారు 1,443 మంది రోగులకు ఖరీదైన జన్యు పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించినట్లు నిమ్స్ వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ పరీక్షలకు లక్షల రూపాయలు ఖర్చవుతుండగా, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందించడం విశేషంగా మారింది. ప్రపంచస్థాయి వైద్య సాంకేతికతను పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ మరోసారి ఆదర్శంగా నిలుస్తోందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లిక్విడ్ బయాప్సీ సేవలు ప్రారంభమైతే క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి సమర్థవంతమైన చికిత్స అందించే అవకాశాలు మరింత పెరుగుతాయని వారు పేర్కొంటున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## విధులు నిర్వహిస్తూనే ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



**హుజూరాబాద్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా హుజూరాబాద్ డిపో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విధులకు హాజరవుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ నిరసనను కొనసాగించారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వేతన సవరణలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, సేవా నిబంధనల అమలు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు హామీలు ఇప్పటికీ అమలు కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ వారి సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో డిపోకు చెందిన పలువురు ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సూపర్ స్టార్ కృష్ణ 83వ జయంతి వేడుకలు



- **నిరుపేద విద్యార్థినికి పుస్తకాలు, విద్యా సహాయం.**

**సత్తుపల్లి, మే 31(తెలంగాణ ముచ్చట్లు):** సూపర్ స్టార్ కృష్ణ 83వ జయంతిని పురస్కరించుకొని మహేష్ బాబు అభిమానుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం సూపర్ స్టార్ కృష్ణ-మహేష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థిని, 8వ తరగతి చదువుతున్న శ్రీ శరణ్యకు పుస్తకాలను అందజేశారు. అదేవిధంగా విద్యార్థిని విద్యాభ్యాసానికి అవసరమైన ఫీజును కూడా ఫౌండేషన్ తరఫున అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజ సేవతో పాటు విద్యార్థులకు అండగా నిలవడం సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఆశయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అభిమాన సంఘ నాయకులు కోటమర్తి వెంకటేశ్వరరావు, రాంబాబు, శ్రీరామమూర్తి, చంద్రశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే విజయవాడ నుంచి ఫౌండేషన్ ప్రతినిధులు సారథి, రబ్బాని హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఫౌండేషన్ సభ్యులు, అభిమాన సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హుజూరాబాద్ సిఎస్ఐ చర్చిలో రెవ. జాన్ బాబు దంపతులకు ఘన వీడ్కోలు



**హుజూరాబాద్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ సిఎస్ఐ చర్చిలో ఆదివారం రెవ. ఈసంపల్లి జాన్ బాబు, విజయమ్మ దంపతులకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. దక్షిణ భారత సంఘం (సిఎస్ఐ) పరిధిలోని కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాలను కలుపుకుని ఏర్పడిన డయాసిస్‌లో భాగంగా గురువులకు నిర్దిష్ట కాల వ్యవధిలో బదిలీలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా హుజూరాబాద్ ఫాస్టరేట్ చైర్మన్‌గా సేవలందించిన రెవ. ఈసంపల్లి జాన్ బాబు వరంగల్ జిల్లా దేశాయిపేటకు బదిలీ కావడంతో సంఘస్తులు ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవ. జాన్ బాబు దంపతులు హుజూరాబాద్ సంఘానికి అందించిన సేవలను కొనియాడుతూ పలువురు మాట్లాడారు. అనంతరం వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాస్టరేట్ కార్యదర్శి సొల్లు బాబు, కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు, యువత, మహిళలు పాల్గొని తమ శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో గూడెపు రవీందర్, సొల్లు మహేందర్, బి. కనకలక్ష్మి, వై. పుష్పలత, జి. సురేఖ, బూర్ల కాంతమ్మ, కె. సంపత్, ఎ. నీలమ్మ, ఎలియా, ఎ. రాజయ్య, ఈ. బంగారి, ఆకునూరి సిద్ధు, అర్చన, కడారి శంకర్, కె. రాజేశ్వరి, కె. సబిత, ఎ. శారద, కె. సుకన్య, ఎం. సుధాకర్, ముద్దమల్ల భాస్కర్, సొల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఫాస్టరేట్ కమిటీ కార్యదర్శి సొల్లు బాబు మరియు కమిటీ సభ్యులు.

# రూ.5.20 కోట్లతో కొండాపురం - పొన్నెకల్లు

# రోడ్డు పనులకు శంకుస్థాపన

- **సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజా ప్రభుత్వం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ఖమ్మం బ్యూరో, మే 31(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామంలో రూ.5.20 కోట్ల వ్యయంతో పొన్నెకల్లు నుండి కొండాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌లతో కలిసి ఆయన ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.

**ఆర్థిక ఇబ్బందులున్నా హామీల అమలు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయడం లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే, రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందని, కొండాపురం-పొన్నెకల్లు రోడ్డు పూర్తయితే ఈ ప్రాంత రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ**

రైతును రాజు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల మేర (రెండు లక్షల రూపాయల వరకు) రైతు రుణమాఫీ చేశామని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి బాధ్యత ముగించుకుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని చెప్పారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా అందజేస్తున్నామని తెలిపారు.

**జూన్ ఒకటి నుంచే ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత**

పేదలకు పక్కా గృహాలు అందించే ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత మంజూరు ప్రక్రియ జూన్ 1 (సోమవారం) నుంచే ప్రారంభం కానుందని మంత్రి వెల్లడించారు. ఈ విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు, ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నాలుగు విడతల్లో రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే మంజూరైన 4.50 లక్షల ఇళ్లకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు.

**రెండేళ్లలో 72 వేల మందికి ఉద్యోగాలు**

ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలోనే 72 వేల మంది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందించామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఆర్‌డీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్: తుమ్మల





**ఖమ్మం బ్యూరో , మే 31(తెలంగాణ ముచ్చట్లు ):** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత నందమూరి తారక రామారావు అని, ఆయన చూపిన సేవా స్ఫూర్తితో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలోని స్వర్ణభారతి కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదని, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన అమలు చేసిన పథకాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని, సామాజిక బాధ్యతతో కమ్మ మహాజన సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజానికి మరింత మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

ఈ శిబిరంలో కాన్సర్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, నేత్ర, స్త్రీరోగ, శిశు, ఈఎన్‌టీ, యూరాలజీ, న్యూరో తదితర విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు సేవలు అందించారు. అలాగే రక్తపరీక్షలు, షుగర్, బీపీ, ఈసీజీ, ఎక్స్‌రే, మామోగ్రామ్ తదితర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలకు కాన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం అత్యంత విలువైన వాహనాలను, పరికరాలను సంఘం సభ్యులు బత్తినేని ప్రకాష్ సమకూర్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. శిబిరం విజయవంతం కావడంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ ఎం ఏ ) ఖమ్మం శాఖ, కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, వైద్యులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు అందించిన సహకారం ప్రశంసనీయమని మంత్రి అన్నారు. కార్యక్రమం నిర్వహించిన కమ్మ మహాజన సంఘం ప్రతినిధులను మంత్రి అభినందించగా, శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ మేయర్ నీరజ, తుమ్మల యుగంధర్ కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షురాలు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, నల్లమల ఆనంద్, మేదరమెట్ల స్వరూపరాణి, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, కోలేటి నవీన్, నంబూరి ప్రసాద్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్, బతినేని ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవే పై సర్వీస్ రోడ్ ఏర్పాటు చేయండి

- **ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి రుణాలు, ఉచిత బోరుబావులు మంజూరు చేయాలి.**
- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు**
- **నెల్లూరి కోటేశ్వరరావు వినతి.**



**ఖమ్మం బ్యూరో, మే 31(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే, రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఒక సమగ్ర వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో ఇబ్బందులు పడుతున్న జిల్లా ప్రజలకు సర్వీసు రోడ్లు నిర్మించడంతో పాటు, దళిత, గిరిజన నిరుద్యోగులకు ఉపాధి రుణాలు, పేద రైతులకు వ్యవసాయ బోరుబావులు మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పై సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నెల్లూరి కోటేశ్వరరావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నాగ్పూర్ అమరావతి క్రాస్ నుంచి వైరా ఎగ్జిట్ వరకు ఉన్న 19.600 కిలోమీటర్ల నుంచి 33.200 కిలోమీటర్ల మార్గంలో రైతుల భూముల మధ్యలోంచి రోడ్డు నిర్మాణం జరిగిందని వివరించారు. దీనివల్ల పొలాలు రెండు భాగాలుగా విడిపోయి, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వెళ్లేందుకు, పండిన ధాన్యాన్ని ఇళ్లకు చేర్చేందుకు దారి లేకుండా పోయిందని , అదేవిధంగా జిల్లా ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ భూములన్నీ నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమాండ్ ఏరియా కింద ఉన్నాయని, రోడ్డు నిర్మాణంతో వాగులు, కాలువలు దాటి పశువులను మేతకు తీసుకెళ్లడం ప్రజలకు, రైతులకు కత్తిమీద సాములా మారిందని పేర్కొన్నారు. ఈ సమస్యకు తక్షణ పరిష్కారంగా హైవేకు ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించి జిల్లా ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు. నిరుపేద దళిత, గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం కోసం కేంద్ర బడ్జెట్ నుంచి ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. దినసరి కూలీలుగా ఉంటూ ఆర్థికంగా వెనుకబడిన యువత స్వయం ఉపాధి పొందేలా కేంద్ర ప్రభుత్వ పథకాలను వారికి వర్తింపజేయాలని కోరారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాధారం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బాలాజీ తండా గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులను మంత్రికి అందజేశారు. అలాగే, సింగరేణి మండలం మాధారం గ్రామానికి చెందిన పేద ఎస్సీ, ఎస్టీ రైతుల వ్యవసాయ భూములకు సాగునీటి సదుపాయం కల్పించాలని మంత్రిని కోరారు. సరైన నీటి వసతి లేక, సొంతంగా బోరుబావులు తవ్వించుకునే స్థోమత లేక ఎంతోమంది పేద రైతుల భూములు బీడువారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సాగునీటి పథకాలైన పీఎంకుసుమ్ , పీఎంకేఎస్‌వై ద్వారా ఈ గ్రామంలోని అర్హులైన రైతులకు ఉచితంగా బోరుబావులు, పంపుసెట్లు మంజూరు చేయాలని విన్నవించారు. తాను స్వయంగా క్షేత్రస్థాయిలో రైతుల దరఖాస్తులను పరిశీలించానని, కేంద్రం ఆదుకుంటే ఆయా కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులు అనూహ్యంగా మెరుగుపడతాయని నెల్లూరి కోటేశ్వరరావు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## జమ్మికుంటలో వర్షా కాల సన్నాహాలు.. డ్రైనేజీ నిర్మాణంపై చర్చలు



**జమ్మికుంట టౌన్ మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు పరిసర ప్రాంతాల్లో వర్షాకాలంలో తలెత్తే వరద సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రాజ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి డ్రైనేజీ నిర్మాణ పనులపై ప్రత్యేకంగా చర్చించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలంలో పట్టణంలోని వరద నీరు నాయిని చెరువులోకి చేరకుండా, అలాగే చెరువు నుంచి వచ్చే మత్తడి నీరు పట్టణ ప్రాంతాలను ముంచెత్తకుండా సమగ్ర ప్రణాళికతో డ్రైన్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నాయిని చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులతో అనుసంధానంగా డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రాజ్‌కుమార్‌ను మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఏఈ వికాస్‌తో కలిసి కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఈ రాజ్‌కుమార్ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, డ్రైన్ నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు చైర్మన్ వెల్లడించారు. పట్టణ ప్రజలకు వరదల ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

## వనపర్తి జిల్లాలో రెడ్ల రాజ్యాన్ని కూల్చి బీసీ రాజ్యాన్ని నిర్మిస్తాం



- **డాక్టర్ విశారదన్ మహారాజ్**

**వనపర్తి,మే31(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ పాలిటెక్నిక్ ప్రాంగణంలో వనపర్తి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఎవరి కులం ఎంతో వారికంత వాటా పేరుతో భారీ బహిరంగ పంచాయతీ సభ నిర్వహించారు. జిల్లా కన్వీనర్ చిలుక బాలరాజ్ సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సబ్బండ వర్గాలకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులను పరిరక్షించడంలో విఫలమైందన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన కోసం సబ్బండ వర్గాల ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.వనపర్తి జిల్లాలో దశాబ్దాలుగా కొనసాగుతున్న రెడ్డి, వెలమ రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలికి బీసీ రాజ్యాన్ని నిర్మిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర ముదిరాజ్, రాష్ట్ర నాయకులు బింగి రాము యాదవ్, కార్తీక్ ఏకలవ్యతో పాటు కొండన్న యాదవ్, మోహన్ కుమార్ యాదవ్, బాలయ్య ముదిరాజ్, అహ్మద్ భాషా, చిలుక రేఖ, యోసేపు, రామకృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

- **వైద్యుల నిర్లక్ష్యంతో వికలాంగుడిగా మారిన ఏడు నెలల పసికందు**



**ఖమ్మం బ్యూరో, మే 31(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామంలో ఏడు నెలల గర్భిణీగా ఉన్నప్పుడే కవల పిల్లలకు జన్మనిచ్చిన తలపాటి సూర్యకాంత్ అనే వ్యక్తి భార్య రేణుక కవల పిల్లల్లో ఓ బాలుడి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో, చికిత్స నిమిత్తం మార్చి 4వ తేదీన ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చిన కుటుంబ సభ్యులు రక్తం తక్కువగా ఉందని రక్తం ఎక్కించే క్రమంలో, కాన్యులా ఏర్పరచిన స్థలంలో వాపు వచ్చిందని కుటుంబ సభ్యులు చెప్పినా పెద్ద సమస్య కాదని దాటివేసిన డాక్టర్లు ఎన్ని రోజులైన వాపు తగ్గకపోవడం, చేయి నల్లగా మారడంతో మరో సారి నిలదీయగా, వెళ్లి ప్రైవేటులో స్కానింగ్ తీసుకొని రండి అంటూ వైద్యుల నిర్లక్ష్యపు సమాధానం స్కానింగ్ రిపోర్టులో చేతిలో కణజాలు దెబ్బతిని, చేయి పూర్తిగా దెబ్బ తిన్నదని రావడంతో డాక్టర్లను నిలదీసిన బాలుడి తల్లిదండ్రులు హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి వెళితే వెంటనే నయం చేస్తారని చెప్పడంతో, మార్చి 26వ తేదీన నిలోఫర్ ఆసుపత్రికి తరలింపు అక్కడి వైద్యులు బాలుడి చేయి పూర్తిగా దెబ్బ తిన్నదని, చేతిని తొలగించాలని చెప్పడంతో కుప్పకూలిపోయిన బాలుడి తల్లిదండ్రులు చేసేదేమీ లేక బాలుడి చేయి తొలగించేందుకు అంగీకరించిన బాలుడి తల్లిదండ్రులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలుడు వికలాంగుడిగా మారాడని ఆవేదన వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు.

# దేవుళ్లు, మతాల పేరిట రాజకీయం చేయం!





- **అన్ని మతాల ఆత్మగౌరవ పరిరక్షణే ప్రజా ప్రభుత్వ విధి**
- **రూ.3.30 కోట్లతో కూసుమంచి గణపేశ్వరాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి**
- **పుష్కరాల నాటికి భద్రాద్రి పనులు పూర్తి అవుతాయని వెల్లడి**

**ఖమ్మం బ్యూరో, మే 31(తెలంగాణ ముచ్చట్లు ):** దేవుళ్లు, మతాల పేరిట రాజకీయం చేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండల కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం (గణపేశ్వరాలయం) పునర్నిర్మాణ, అభివృద్ధి పనులకు రూ.3.30 కోట్ల వ్యయంతో ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.లతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రతి మతం ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడుతామని.. దేవాలయాలతో పాటు చర్చిలు, మసీదుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఇటీవల సమ్మక్కసారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు.

గత ప్రభుత్వం భద్రాచలం ఆలయ అభివృద్ధికి వంద కోట్లు ఇస్తామని ప్రకటించి.. ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మంత్రి విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి ఆలయ సమగ్ర రూపురేఖలు మార్చేందుకు రూ.350 కోట్లు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారని, వారం పది రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూసేకరణ కోసమే ఇప్పటికే రూ.68 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1,000 కోట్లు మంజూరు చేసిందని, అందులో భాగంగానే గణపేశ్వరాలయ పనులను చేపట్టామన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, దేవాదాయ శాఖ అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన బీఎస్పీని బలోపేతం చేయాలి

- **రాష్ట్ర నాయకుడు దొడ్డె సమ్మయ్య**



**జమ్మికుంట టౌన్ మే 31(తెలంగాణ ముచ్చట్లు):** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేసి పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పీస్పీ రాష్ట్ర నాయకుడు దొడ్డె సమ్మయ్య పిలుపునిచ్చారు. ఆదివారం జమ్మికుంటలో నిర్వహించిన హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం హుజురాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు మంద సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దొడ్డె సమ్మయ్య మాట్లాడుతూ పార్టీ విస్తరణ కోసం నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ గ్రామాన గడపగడపకు వెళ్లి బీఎస్పీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని, పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. బహుజన వర్గాల అభ్యున్నతే బీఎస్పీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), వేల్పుల మల్లేష్, మారముల్ల సాంబయ్య, రాచపల్లి రమేష్, గరిగె చంద్రయ్య, రామ్ శ్రీనివాస్, మొలుగూరి శ్రీనివాస్, బీసీ నాయకులు మామిండ్ల మల్లయ్య, దాసరపు ప్రవీణ్, అంబాల అంజి, కోరి రంజిత్, మడిపల్లి చక్రపాణి, హుజురాబాద్ నియోజకవర్గ సోషల్ మీడియా, మీడియా ఇన్‌చార్జ్ మంద జగన్ పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**పెబ్బేరు,మే 31(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.ఆదివారం వనపర్తి జిల్లా పెబ్బేరులో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని, వనపర్తి నియోజకవర్గంలో 37,500 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం అందజేస్తోందని తెలిపారు.అలాగే ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వారి ఆర్థిక పురోగతికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.మహిళలను వివిధ రంగాల్లో భాగస్వాములను చేస్తూ స్వయం సమృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.మహిళల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే విమర్శలకు సమాధానం చెబుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికే రోల్ మోడల్ 'ప్రెస్ క్లబ్' నిర్మించాలి

- **రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ**






**ఖమ్మం బ్యూరో , మే 31(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన 'ఫోర్త్ ఎస్టేట్'ను బలోపేతం చేసే దిశగా ఖమ్మంలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన రోల్ మోడల్ ప్రెస్ క్లబ్‌ను నిర్మించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. శరవేగంగా మారుతున్న సాంకేతిక యుగానికి అనుగుణంగా 100 ఇంచుల డిజిటల్ స్క్రీన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సదుపాయాలు, ఆడియో విజువల్ వ్యవస్థలు, హైటెక్ కమ్యూనికేషన్ పరికరాలతో ప్రెస్ క్లబ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.

రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు తమ అభిప్రాయాలు, విధానాలను ప్రజలకు సమర్థవంతంగా తెలియజేసేందుకు ఈ ప్రెస్ క్లబ్‌ను ఒక ప్రజాస్వామ్య వేదికగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, యూట్యూబ్, డిజిటల్, వెబ్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు అందరూ వినియోగించుకునే విధంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం దీనిని దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా నిర్మించి జర్నలిస్టులకు బహుమతిగా అందించాలని అన్నారు.

స్థానిక ఎన్ఎస్పి క్యాంపులో అనేక స్థలాలు ఎందరికో ఇచ్చారని, కొందరు అనర్హులకు కూడా ఇచ్చారని, ఫోర్ పిల్లర్స్ లో ఫోర్త్ పిల్లర్ గా ఉన్న 'ఫోర్త్ ఎస్టేట్' మిగతా మూడు పిల్లర్లకు పారదర్శకత, జవాబుదారితనాన్ని కూడా గుర్తుచేస్తుందని అట్లాంటి 4వ స్తంభమైన 'ఫోర్త్ ఎస్టేట్' కి స్థానిక ఎన్ఎస్పీ క్యాంపులో స్థలాన్ని కేటాయించాలని కోరారు. దేశంలోని మిగతా మూడు స్తంభాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, పదవులు, ఆర్థిక భద్రత, కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నప్పటికీ 'ఫోర్త్ ఎస్టేట్'లో పనిచేస్తున్న పాత్రికేయులు ఇప్పటికీ ప్రైవేట్ సంస్థలపై ఆధారపడి జీవనం సాగించడం విచారకరమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు దాటినా జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, జీవనోపాధి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశం 147వ స్థానానికి చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. తెలంగాణలో పత్రికా స్వేచ్ఛకు పునర్జీవనం పోసే విధంగా ఖమ్మంలోని ఎన్.ఎస్.పి క్యాంపు ప్రాంతంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించి, 50 లక్షలతో ప్రెస్ క్లబ్ హాలును నిర్మించి స్థానిక పాత్రికేయులకు బహుమతిగా ఇవ్వాలని సాదిక్ అలీ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, సమాచార శాఖామాత్యులు స్థానికంగా ఉండటం ఖమ్మంను జర్నలిస్టుల సంక్షేమానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అనుకూల అవకాశమన్నారు. ఈ లక్ష్య సాధన కోసం పాత్రికేయులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మహమ్మద్ జావేద్ సేవలకు కాంగ్రెస్ పార్టీ ఘన నివాళి

- పార్టీ కష్టకాలంలో అంకితభావంతో పనిచేసిన నాయకుడని కొనియాడిన నేతలు
- జావేద్ భాయ్ ఆశయాలను కొనసాగించనున్న షహెలా





**ఖమ్మం బ్యూరో , మే 31(తెలంగాణ ముచ్చట్లు ):**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, టీపీసీసీ సభ్యుడు మహమ్మద్ జావేద్ భాయ్ సేవలను స్మరించుకుంటూ ఆదివారం ఖమ్మం నగరంలోని రెడ్ హిల్స్‌లో ఘన స్మారక సభ నిర్వహించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన జావేద్ భాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ అగ్రనేతలు నివాళులర్పించారు. ఆయన అకాల మరణం పార్టీకి, ఖమ్మం నగరానికి తీరని లోటని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ అజహరుద్దీన్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జావేద్ భాయ్ పార్టీ పట్ల చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావాన్ని కొనియాడుతూ ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

ప్రత్యేకంగా మాట్లాడిన మీనాక్షి నటరాజన్, జావేద్ భాయ్ కేవలం ఖమ్మం లేదా తెలంగాణకే పరిమితమైన నాయకుడు కాదని, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంస్థాగత కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తి అని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో కలిసి పనిచేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని కొనియాడారు.

జావేద్ భాయ్ ఆశయాలను ఆయన కుమార్తె షహెలా జావేద్ కొనసాగిస్తానని ముందుకు రావడం శుభపరిణామమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఆమె రాజకీయ ప్రస్థానంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, జావేద్ కుటుంబానికి ఎల్లవేళలా తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జావేద్ భాయ్ సేవలను స్మరించుకుంటూ భావోద్వేగ నివాళులర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు ఎంజీఎం మృతి

**జమ్మికుంట టౌన్ మే 31 (తెలంగాణ ముచ్చట్లు):**రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలో విషాదాన్ని నింపింది. మచ్చుపేట గ్రామానికి చెందిన అలిశెట్టి రామస్వామి (66) ఈ నెల 29న తన బావ గొల్ల జయరాములు, మనవడు గొల్ల నిషిధర్‌తో కలిసి బిజిగిరి గ్రామంలోని దర్గా వద్ద జరిగిన కందూరు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో తనుగుల గ్రామ శివారులోని మూల మలుపు వద్దకు చేరుకున్న సమయంలో గుంపుల గ్రామం వైపు నుంచి జమ్మికుంట దిశగా వస్తున్న గుర్తుతెలియని బొలెరో వాహనం అతి వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో రామస్వామి తీవ్రంగా గాయపడగా, ఛాతి భాగంలో బలమైన గాయం కావడంతో పాటు రెండు కాళ్లకు రాపిడి గాయాలయ్యాయి. గాయపడిన రామస్వామిని మొదట జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం శ్రీరామ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం మధ్యాహ్నం 12:10 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు అలిశెట్టి నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని బొలెరో వాహన డ్రైవర్‌ను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## వడదెబ్బతో మహిళ మృతి



**భీమదేవరపల్లి, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన సమ్ము మంకమ్మ (65) వడదెబ్బకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆమె, ఇటీవల తీవ్ర ఎండల ప్రభావంతో అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మంకమ్మ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. మండలంలో కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# మాతృశ్రీ పార్కు ప్రారంభం




- ఉపరాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభం
- గ్రామీణాభివృద్ధికి కొత్త ఊతం
- మహిళా సాధికారతకు ప్రోత్సాహం

**బెళ్తంగడి, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** కర్ణాటకలోని బెళ్తంగడిలో ఏర్పాటు చేసిన సిరి మాతృశ్రీ పారిశ్రామిక పార్కును భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పార్కు కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ గ్రామీణ భారతదేశాన్ని సుసంపన్నంగా తీర్చిదిద్దే కలను సాకారం చేయడంలో సిరి వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఉపాధి అవకాశాల కల్పన, స్వయం ఉపాధి ప్రోత్సాహం ద్వారా వేలాది మహిళలు, గ్రామీణ కుటుంబాల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. మహిళల సాధికారత దేశ అభివృద్ధికి బలమైన పునాది అని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు.

పారిశ్రామిక పార్కులు గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, రాజ్యసభ సభ్యుడు, సిరి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ డి. వీరేంద్ర హెగ్గడే, లోక్‌సభ సభ్యుడు బృజేష్ చౌటా, సిరి సంస్థ వ్యవస్థాపకురాలు హేమావతి వి. హెగ్గడే పాల్గొన్నారు. ప్రముఖులు పార్కు ఏర్పాటును అభినందించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యాలతో సిరి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని సభలో పలువురు అభిప్రాయపడ్డారు. ఈ పారిశ్రామిక పార్కు ద్వారా స్థానిక ప్రజలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని తెలిపారు.

# సీడీఎస్‌గా రాజా సుబ్రమణి




- జాతీయ భద్రతే ప్రాధాన్యం
- సైనిక సంస్కరణలకు వేగం
- ఉమ్మడి సమన్వయంపై దృష్టి

**న్యూఢిల్లీ, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రధాన రక్షణ దళాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి దేశ సార్వభౌమాధికార పరిరక్షణ, జాతీయ భద్రత బలోపేతంపై రక్షణ దళాల అచంచల నిబద్ధతను పునరుద్ఘాటించారు. దేశ భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లో రక్షణ దళాలు మరింత సమర్థవంతంగా పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడిన జనరల్ రాజా సుబ్రమణి, సైనిక వ్యవస్థలో మార్పులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు రక్షణ దళాలను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడం అవసరమని పేర్కొన్నారు. భూ, నౌకా, వాయుసేనల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ఉంటుందని ఆయన వెల్లడించారు. ఉమ్మడి కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా దేశ రక్షణ వ్యవస్థ మరింత పటిష్ఠమవుతుందని అభిప్రాయపడ్డారు. సైనిక దళాల కార్యాచరణలో అత్యున్నత ప్రమాణాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని జనరల్ రాజా సుబ్రమణి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆయుధ సామర్థ్యాల పెంపు, శిక్షణ వ్యవస్థల బలోపేతం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. సైనికులు, నావికులు, వాయుసేన సిబ్బంది సంక్షేమంతో పాటు మాజీ సైనికుల సంక్షేమంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం సేవలందించిన ప్రతి ఒక్కరి సంక్షేమం ప్రభుత్వానికి, రక్షణ దళాలకు అత్యంత ముఖ్యమని తెలిపారు. వీరనారుల సంక్షేమం కోసం కొనసాగుతున్న కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు కూడా జనరల్ రాజా సుబ్రమణి స్పష్టం చేశారు. దేశ భద్రత, సైనిక సామర్థ్యాల పెంపు, సిబ్బంది సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో రక్షణ దళాలు ముందుకు సాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# విహార యాత్రలో విషాదం

- లోయలో పడిన ట్యాక్సీ
- ఎనిమిది ప్రాణాలు బలి
- గాలింపులో సహాయక బృందాలు



**చంబా, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకులతో వెళ్తున్న ఓ టూరిస్టు ట్యాక్సీ అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో ఈ విషాదం సంభవించింది. మృతుల్లో డ్రైవర్‌తో పాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బెంగళూరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రెండు కుటుంబాల సభ్యులు ఈ ప్రమాదంలో మృతి చెందినట్లు గుర్తించారు. బైరాగఢ్-సచ్ పాస్ మార్గంలోని కాలాబన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. వేసవి సెలవులను గడిపేందుకు డల్హౌసీ ప్రాంతానికి వచ్చిన రెండు కుటుంబాలు మంచు పర్వతాలను సందర్శించేందుకు ట్యాక్సీలో బయలుదేరాయి. అయితే ప్రయాణం ముగిసిన తర్వాత కూడా వారు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, ట్యాక్సీ యజమాని ఆందోళనకు గురయ్యారు. వాహనంలో అమర్చిన జీపీఎస్ వ్యవస్థను పరిశీలించిన ట్యాక్సీ యజమాని కాలాబన్ ప్రాంతంలో వాహనం కదలకుండా ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు పరిశీలించగా ట్యాక్సీ లోతైన లోయలో పడిపోయినట్లు తేలింది. ప్రమాదం జరిగిన ప్రాంతం అత్యంత దుర్భరమైన కొండ ప్రాంతంగా ఉండటంతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయి. మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవడం వల్ల సమాచార మార్పిడి, గాలింపు కార్యక్రమాల్లో ఆటంకాలు ఎదురవుతున్నట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎనిమిది మంది ప్రయాణికులతో వెళ్తున్న వాహనం లోయలో పడిపోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించామని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం సహాయక బృందాలు ఘటనాస్థలంలో మృతదేహాల కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగిస్తున్నాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# బ్రహ్మోస్‌కు పెరుగుతున్న డిమాండ్

- వియత్నాంతో కీలక ఒప్పందం
- ఇండోనేషియాతో తుది చర్చలు
- రక్షణ ఎగుమతుల్లో ముందడుగు




**సింగపూర్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రక్షణ రంగానికి మరో కీలక విజయం దక్కింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందిన బ్రహ్మోస్‌ను వియత్నాంకు విక్రయించేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశకు చేరుకున్నట్లు భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో నిర్వహించిన షాంగ్రీలా భద్రతా సదస్సులో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందంపై ఇప్పటికే సంతకాలు పూర్తయ్యాయని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. అధికారిక ప్రకటన వెలువడకపోయినా ఒప్పంద ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ ఒప్పందం విలువ సుమారు రూ.5,800 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక సహకారం కూడా అందించనున్నారు. ఇండోనేషియాతో చర్చలు కూడా వేగంగా సాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య మిగిలిన అంశాలపై సంప్రదింపులు ముగింపు దశలో ఉన్నాయని, త్వరలోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆగ్నేయాసియా ప్రాంతంలో భారత రక్షణ ఉత్పత్తులకు మరింత మార్కెట్ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు భారీ ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో భారతదేశం నుంచి బ్రహ్మోస్ కొనుగోలు చేసిన తొలి విదేశంగా ఫిలిప్పీన్స్ నిలిచింది. ఇప్పుడు వియత్నాం కూడా ఆ జాబితాలో చేరగా, ఇండోనేషియా త్వరలో చేరే అవకాశాలు ఉన్నాయి. చైనాతో సముద్ర సరిహద్దు వివాదాలు ఎదుర్కొంటున్న దేశాలు తమ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకునేందుకు బ్రహ్మోస్‌పై ఆసక్తి చూపుతున్నాయి. ధ్వని వేగం కన్నా మూడు రెట్లు అధిక వేగంతో ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించే సామర్థ్యం ఉంది. శత్రు యుద్ధనౌకలు, కీలక సైనిక స్థావరాలను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకుని దాడి చేయగలదు. దీని వేగం, ఆధునిక సాంకేతికత కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను 2030 నాటికి రూ.50,000 కోట్లకు పెంచాలనే లక్ష్యంతో భారత్ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో బ్రహ్మోస్ ఒప్పందాలు భారత రక్షణ పరిశ్రమకు కొత్త అవకాశాలు తెరుస్తున్నాయి.

సోమవారం - 1 - జూన్ 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# నడక మరిచిపోతున్న సమాజం

- వాహనాలపై పెరిగిన ఆధారం
- ఆరోగ్యానికి మౌన ముప్పు
- అడుగులు వేస్తేనే ఆరోగ్యం

**డెస్క్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** ఒకప్పుడు నడక మనిషి జీవితంలో సహజమైన భాగం. పాఠశాలకు వెళ్లే విద్యార్థి నుంచి పొలానికి వెళ్లే రైతు వరకు ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో నడకకు ప్రత్యేక స్థానం ఉండేది. కానీ కాలం మారింది. నేడు చిన్న దూరాలకు కూడా ద్విచక్ర వాహనాలు, కార్లను వినియోగించడం సాధారణంగా మారిపోయింది. సాంకేతిక సౌకర్యాలు పెరగడంతో శారీరక శ్రమ తగ్గిపోయింది. కార్యాలయాల్లో గంటల తరబడి కూర్చోవడం, ఇంటికి వచ్చిన తర్వాత మొబైల్ ఫోన్లు, టెలివిజన్‌లకే పరిమితమవడం వల్ల నడక క్రమంగా మన జీవితాల నుంచి కనుమరుగవుతోంది. సౌకర్యాల కోసం మనిషి ఎంత ముందుకు వెళ్తున్నాడో, ఆరోగ్యాన్ని కాపాడే అలవాట్ల నుంచి అంతే వేగంగా దూరమవుతున్నాడు. నడక తగ్గిపోవడం అనేది వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, సమాజ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న మౌన సంక్షోభంగా మారుతోంది. నడక తగ్గిపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఒకప్పుడు వృద్ధాప్యంలో కనిపించే మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు ఇప్పుడు యువతలోనే కనిపిస్తున్నాయి. ఊబకాయం సమస్య కూడా వేగంగా పెరుగుతోంది. శరీరానికి అవసరమైన కనీస కదలిక లేకపోవడం వల్ల కొవ్వు పేరుకుపోవడం, జీవక్రియలు మందగించడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. వైద్య నిపుణులు ప్రతిరోజూ కనీసం అరగంట నడక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెబుతున్నప్పటికీ, చాలా మంది తమ బిజీ జీవితంలో దానికి సమయం కేటాయించడం లేదు. ఫలితంగా ఆసుపత్రుల చుట్టూ తిరిగే వారి సంఖ్య పెరుగుతోంది. ఆరోగ్యాన్ని కాపాడే సులభమైన మార్గాన్ని వదిలేసి, తర్వాత చికిత్సల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడుతోంది. పిల్లల్లో నడక అలవాటు తగ్గిపోవడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఒకప్పుడు పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లే పిల్లలు, సాయంత్రం బయట ఆటలు ఆడే చిన్నారులు ఇప్పుడు ఇంటికే పరిమితమవుతున్నారు. మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్‌లు, సామాజిక మాధ్యమాలు వారి సమయాన్ని ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా శారీరక చురుకుదనం తగ్గి చిన్న వయస్సులోనే ఆరోగ్య సమస్యలు కనిపిస్తున్నాయి. ఆటస్థలాల కొరత కూడా దీనికి మరో కారణంగా మారింది. పిల్లలు ప్రకృతికి, శారీరక వ్యాయామానికి దూరమవుతున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, భవిష్యత్ తరాల జీవనశైలిని ప్రభావితం చేసే సామాజిక సమస్యగా కూడా మారుతోంది. పట్టణాల నిర్మాణ విధానం కూడా నడక తగ్గడానికి కారణమవుతోంది. పాదచారులకు అనుకూలంగా ఉండాల్సిన రహదారులు అనేక చోట్ల కనిపించడం లేదు. పెరుగుతున్న ట్రాఫిక్, కాలుష్యం, ఖాళీ ప్రదేశాల కొరత ప్రజలను నడకకు దూరం చేస్తున్నాయి. ఒకప్పుడు కాలనీల్లో కనిపించిన చిన్న పార్కులు, చెట్లతో నిండిన వీధులు ఇప్పుడు కాంక్రీట్ నిర్మాణాలకు చోటు ఇస్తున్నాయి. నగరాభివృద్ధి ప్రణాళికల్లో పాదచారులకు, సైకిల్ మార్గాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల ప్రజలు పూర్తిగా వాహనాలపై ఆధారపడుతున్నారు. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రహదారులు మాత్రమే కాదని, ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన వాతావరణం కూడా కావాలని గుర్తించాల్సిన అవసరం ఉంది.నడకను తిరిగి జీవితంలో భాగం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. చిన్న దూరాలకు వాహనాలను ఉపయోగించకుండా నడవడం, ఉదయం లేదా సాయంత్రం కొంత సమయం నడకకు కేటాయించడం, పిల్లలను ఆటల వైపు ప్రోత్సహించడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారి తీస్తాయి. నడకకు ఖర్చు అవసరం లేదు, ప్రత్యేక పరికరాలు అవసరం లేదు, వయస్సుతో సంబంధం లేదు. ఆరోగ్యాన్ని కాపాడే అత్యంత సులభమైన మార్గం నడకే. ప్రతి అడుగు శరీరానికి శక్తిని, మనసుకు ప్రశాంతతను అందిస్తుంది. నడకను మరిచిపోతున్న సమాజం అనారోగ్యం వైపు నడుస్తుంటే, నడకను అలవాటు చేసుకున్న సమాజం ఆరోగ్యవంతమైన భవిష్యత్తు వైపు అడుగులు వేస్తుంది. అందుకే నడకను అలవాటుగా మార్చుకోవడం నేటి అవసరం, రేపటి ఆరోగ్య భద్రత.

# పాలే ఆరోగ్య సంపద




ప్రతి సంవత్సరం జూన్ 1న ప్రపంచ పాల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ప్రజల ఆరోగ్యంలో పాలు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తు చేయడం, పాల ఉత్పత్తుల వినియోగంపై అవగాహన పెంచడం, పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహం అందించడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రస్తుతం అనేక దేశాల్లో విస్తృతంగా జరుపుకుంటున్నారు. మానవ జీవితంలో పాలు ఒక సాధారణ ఆహార పదార్థం మాత్రమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడే అమూల్యమైన సహజ వరంగా భావిస్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల ఆహారంలో పాలు అంతర్భాగంగా మారాయి. పాలను సంపూర్ణ ఆహారంగా పరిగణించడానికి అనేక కారణాలు ఉన్నాయి. శరీరానికి అవసరమైన కాల్షియం, ప్రోటీన్లు, విటమిన్ ఎ, విటమిన్ డి, పొటాషియం వంటి ఎన్నో పోషకాలు పాలలో సమృద్ధిగా లభిస్తాయి. పిల్లల ఎదుగుదలకు, ఎముకల బలానికి, దంతాల ఆరోగ్యానికి పాలు ఎంతో ఉపయోగపడతాయి. శారీరక శ్రమ చేసే వారికి శక్తిని అందించడంలో కూడా పాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. రోజూ ఒక గ్లాసు పాలు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన అనేక పోషకాలు సహజంగానే అందుతాయి. అందుకే వైద్య నిపుణులు అన్ని వయస్సుల వారు పాలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తుంటారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలలో పాల పాత్ర మరింత విశిష్టమైనది. పుట్టినప్పటి నుంచి బాల్యంలోకి అడుగుపెట్టే వరకు పిల్లలకు పాలు ప్రధాన పోషక వనరుగా ఉంటాయి. మెదడు అభివృద్ధి, కండరాల పెరుగుదల, రోగనిరోధక శక్తి పెంపు వంటి అనేక అంశాల్లో పాలు కీలక పాత్ర పోషిస్తాయి. నేటి కాలంలో జంక్ ఫుడ్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పిల్లల్లో పోషకాహార లోపాలు కనిపిస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో పాలు, పాల ఉత్పత్తులు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి. కుటుంబాలు పిల్లలకు పాలు తాగే అలవాటు పెంచడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను చాలా వరకు నివారించవచ్చు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు కూడా పాలు ఎంతో అవసరం. గర్భధారణ సమయంలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అనేక పోషకాలు పాల ద్వారా అందుతాయి. ప్రసవం అనంతరం తల్లి ఆరోగ్య పునరుద్ధరణకు కూడా పాలు తోడ్పడతాయి. వృద్ధాప్యంలో ఎముకల బలహీనత, కీళ్ల సమస్యలు, శారీరక నీరసం వంటి సమస్యలను తగ్గించడంలో పాలు ఉపయోగకరంగా ఉంటాయి. అందువల్ల ప్రతి వయస్సు వారికి అనువైన ఆహారంగా పాలు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిలో పాలను భాగం చేసుకోవడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి దేశంగా గుర్తింపు పొందింది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న రైతులకు పాడి పరిశ్రమ ఒక స్థిరమైన ఆదాయ వనరుగా మారింది. వ్యవసాయంతో పాటు పశుపోషణ చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రతిరోజూ పాలు విక్రయించే అవకాశం ఉండటంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోంది. పాడి పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. పాడి పరిశ్రమతో అనుబంధంగా అనేక ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడుతున్నాయి. పాల సేకరణ కేంద్రాలు, శీతలీకరణ యూనిట్లు, పాల ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, రవాణా రంగం వంటి అనేక విభాగాల్లో వేలాది మంది ఉద్యోగాలు పొందుతున్నారు. పాలు మాత్రమే కాకుండా పెరుగు, వెన్న, నెయ్యి, పనీర్, జున్ను వంటి ఉత్పత్తులకు కూడా మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ రంగం అభివృద్ధి చెందడం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. మహిళల స్వయం ఉపాధికి కూడా పాడి పరిశ్రమ బలమైన వేదికగా మారుతోంది.

# తల్లిదండ్రులే తొలి గురువులు



**డెస్క్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి మనిషి జీవిత ప్రయాణానికి ఆరంభం కుటుంబం నుంచే జరుగుతుంది. ఆ కుటుంబానికి కేంద్రబిందువుగా నిలిచేది తల్లిదండ్రులు. పిల్లలకు జన్మనివ్వడమే కాకుండా వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను కూడా తల్లిదండ్రులే భుజాన వేసుకుంటారు. వారి ప్రేమ, ఆప్యాయత, కష్టం, త్యాగం కారణంగానే పిల్లలు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారు. తల్లిదండ్రుల సేవలను, వారి అమూల్యమైన పాత్రను గుర్తిస్తూ ప్రతి సంవత్సరం జూన్ 1న ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక దినాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. పిల్లలకు తొలి పాఠశాల ఇల్లు అయితే, తొలి గురువులు తల్లిదండ్రులే. చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు, నైతిక విలువలు, క్రమశిక్షణ, మానవత్వం వంటి అంశాలను పిల్లలకు నేర్పేది తల్లిదండ్రులే. పుస్తకాల్లో లభించని జీవిత పాఠాలను వారు తమ అనుభవాల ద్వారా పిల్లలకు అందిస్తారు. మంచి చెడులను గుర్తించే వివేకం, ఇతరులతో మెలగాల్సిన తీరు, సమాజంలో బాధ్యతాయుతంగా జీవించే మార్గం వంటి ఎన్నో విషయాలు కుటుంబ వాతావరణంలోనే పిల్లలు నేర్చుకుంటారు. అందుకే తల్లిదండ్రుల ప్రభావం పిల్లల వ్యక్తిత్వ నిర్మాణంలో ఎంతో కీలకంగా ఉంటుంది.

తల్లిదండ్రుల ప్రేమకు ఎలాంటి కొలమానం ఉండదు. తమ పిల్లలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో వారు ఎన్నో కష్టాలను భరిస్తారు. తమ అవసరాలను పక్కన పెట్టి పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం శ్రమిస్తారు. కొన్నిసార్లు తమ కలలను కూడా త్యజించి పిల్లల కలలను నిజం చేయడానికి ప్రయత్నిస్తారు. పిల్లల విజయం వెనుక తల్లిదండ్రుల కష్టం, సహనం, త్యాగం దాగి ఉంటుంది. ఈ త్యాగాలను గుర్తించడం ప్రతి సంతానం బాధ్యతగా భావించాలి. నేటి ఆధునిక జీవితంలో కుటుంబ సంబంధాలు మారుతున్నాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు, సాంకేతిక పరిజ్ఞానం కారణంగా కుటుంబ సభ్యుల మధ్య కలిసి గడిపే సమయం తగ్గుతోంది. పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లతో గడుపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు పిల్లలతో మరింత సన్నిహితంగా ఉండాల్సిన అవసరం ఉంది. వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, సమస్యలను వినడం, సరైన మార్గదర్శకత్వం అందించడం ఎంతో ముఖ్యంగా మారింది. పిల్లల మానసిక ఆరోగ్యానికి కూడా తల్లిదండ్రుల ప్రేమ, మద్దతు అత్యంత అవసరం.

సమాజ నిర్మాణంలో కూడా తల్లిదండ్రుల పాత్ర విశేషమైనది. మంచి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత కుటుంబం నుంచే ప్రారంభమవుతుంది. విలువలతో కూడిన విద్య, బాధ్యతాయుతమైన ప్రవర్తన, ఇతరుల పట్ల గౌరవం వంటి లక్షణాలు పిల్లల్లో పెంపొందితే సమాజం కూడా ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందుతుంది. అందువల్ల తల్లిదండ్రులు కేవలం తమ కుటుంబానికే కాకుండా దేశ భవిష్యత్తుకు కూడా పునాది వేస్తున్నారు. వారి కృషి వల్లే సమాజం ముందుకు సాగుతోంది. పిల్లల విజయాల్లో తల్లిదండ్రుల పాత్ర ఎంత ముఖ్యమో అపజయాల సమయంలో కూడా అంతే ముఖ్యమవుతుంది. పిల్లలు ఎదుర్కొనే నిరాశలు, ఒత్తిళ్లు, సమస్యల సమయంలో వారికి అండగా నిలిచేది తల్లిదండ్రులే. ఓదార్పు, ధైర్యం, ప్రోత్సాహం అందిస్తూ మళ్లీ ముందుకు నడిపిస్తారు. జీవితంలో ఎన్నో సవాళ్లు వచ్చినా పిల్లలకు వెన్నుదన్నుగా నిలిచే శక్తి తల్లిదండ్రుల ప్రేమలో ఉంటుంది. అందుకే ప్రపంచంలోని ఏ బంధంతోనూ తల్లిదండ్రుల బంధాన్ని పోల్చలేమని అంటారు.

# ఊపిరికి పెరుగుతున్న ముప్పు

- కలుషితమవుతున్న జీవనాధారం
- ఆరోగ్యానికి పెను సవాలు
- పచ్చదనమే శాశ్వత పరిష్కారం



**డెస్క్, మే 31 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రకృతి మనిషికి ప్రసాదించిన అమూల్యమైన వరాల్లో గాలి అత్యంత ముఖ్యమైనది. ఆహారం లేకుండా కొన్ని రోజులు, నీరు లేకుండా కొంతకాలం జీవించడం సాధ్యమవుతుందేమో కానీ గాలి లేకుండా కొన్ని నిమిషాలు కూడా జీవించడం అసాధ్యం. అలాంటి గాలి నేడు ప్రపంచవ్యాప్తంగా కలుషితమవుతోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన గాలితో కళకళలాడిన ప్రాంతాలు నేడు పొగ, ధూళి, విషవాయువులతో నిండిపోతున్నాయి. అభివృద్ధి పేరుతో పెరుగుతున్న పరిశ్రమలు, లక్షల సంఖ్యలో రోడ్లపైకి వస్తున్న వాహనాలు, విచక్షణారహితంగా నరికివేస్తున్న చెట్లు గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. మానవ జీవనానికి ఆధారమైన గాలే క్రమంగా ప్రమాదకరంగా మారుతుండటం ఆందోళన కలిగించే అంశం. గాలి కాలుష్యం ప్రభావం కేవలం పర్యావరణానికే పరిమితం కాదు. అది నేరుగా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. ఉబ్బసం, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, అలర్జీలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు గాలి కాలుష్యానికి ఎక్కువగా గురవుతున్నారు. కనిపించని సూక్ష్మ ధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి చేరి మెల్లగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రజారోగ్య వ్యవస్థపై మరింత భారం పడే ప్రమాదం ఉంది. నగరీకరణ వేగంగా పెరుగుతున్న కొద్దీ గాలి కాలుష్యం కూడా అదే స్థాయిలో విస్తరిస్తోంది. భారీ భవనాలు, నిర్మాణ పనులు, ట్రాఫిక్ రద్దీ కారణంగా నగరాల్లో స్వచ్ఛమైన గాలి దొరకడం కష్టమవుతోంది. ఉదయం వేళల్లో సేదతీరే ఉద్యానవనాలు కూడా కొన్ని ప్రాంతాల్లో కాలుష్య ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు పచ్చని చెట్లతో నిండిన ప్రదేశాలు కాంక్రీట్ అడవులుగా మారుతున్నాయి. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ ప్రకృతిని పూర్తిగా విస్మరించడం వల్ల దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతున్నాయి. నేటి సౌకర్యాల కోసం రేపటి తరాల ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ఎదురవుతోంది. గ్రామీణ ప్రాంతాలు కూడా గాలి కాలుష్యం నుంచి పూర్తిగా సురక్షితంగా లేవు. పంట అవశేషాలను తగలబెట్టడం, ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా కాల్చడం, పెరుగుతున్న రవాణా వ్యవస్థల ప్రభావం వల్ల పల్లెల్లో కూడా వాతావరణం మారుతోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన గాలికి పేరుగాంచిన గ్రామాల్లో ఇప్పుడు కాలుష్య ప్రభావం కనిపిస్తోంది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. గాలి నాణ్యత క్షీణించడం వల్ల జీవన నాణ్యత కూడా తగ్గిపోతోంది. చెట్లు గాలి స్వచ్ఛతకు సహజ రక్షకులుగా నిలుస్తాయి. అవి కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ప్రాణవాయువును విడుదల చేస్తాయి. కానీ నేడు అభివృద్ధి పనుల పేరుతో పెద్దఎత్తున చెట్లను తొలగిస్తున్నారు. ఒక చెట్టు పెరగడానికి సంవత్సరాలు పడుతుంటే దానిని నరికివేయడానికి కొన్ని నిమిషాలే సరిపోతున్నాయి. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఉష్ణోగ్రతలు పెరగడం, అసమాన వర్షపాతం, ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువ కావడం వంటి పరిణామాలకు ఇది కూడా ఒక కారణంగా మారుతోంది. స్వచ్ఛమైన గాలి ప్రతి మనిషికి లభించాల్సిన ప్రాథమిక హక్కు. అది విలాస వస్తువు కాదు. ధనవంతుడు అయినా, పేదవాడు అయినా, గ్రామంలో ఉన్నా, నగరంలో ఉన్నా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే హక్కు ఉంది. కానీ నేడు అనేక ప్రాంతాల్లో ప్రజలు కలుషిత గాలిని పీల్చుకోవడానికి బలవంతం అవుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత అయితే, పర్యావరణాన్ని సంరక్షించడం సమాజం మొత్తం బాధ్యతగా భావించాలి. ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణకు మరింత కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించాలి. పర్యావరణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచి వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలి. అదే సమయంలో నగరాల్లో భారీ స్థాయిలో చెట్ల పెంపక కార్యక్రమాలు నిర్వహించాలి. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా మార్చాలి. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రతి వ్యక్తి ఒక చెట్టును నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను బహిరంగంగా కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారి తీస్తాయి. ప్రకృతిని కాపాడితేనే మనిషి మనుగడ సురక్షితంగా ఉంటుంది. స్వచ్ఛమైన గాలి కోసం పోరాటం అనేది కేవలం పర్యావరణవేత్తల బాధ్యత కాదు. అది ప్రతి పౌరుడి కర్తవ్యం. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలంటే ఇప్పుడే మేల్కొని చర్యలు చేపట్టాలి. పచ్చదనాన్ని పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం ద్వారానే స్వచ్ఛమైన గాలి అందరికీ అందే రోజులు తిరిగి వస్తాయి.

# మెంతుల మహిమలు



- ఆరోగ్యానికి సహజ వరం
- వంటింటి ఔషధ గింజలు
- రోజువారీ వినియోగం మేలు

మెంతులు చిన్న గింజలే అయినప్పటికీ ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలను కలిగి ఉంటాయి. భారతీయ వంటకాలలో విరివిగా ఉపయోగించే ఈ గింజలు ప్రత్యేకమైన రుచి, సువాసనను అందించడమే కాకుండా శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కూడా అందిస్తాయి. పురాతన కాలం నుంచే మెంతులను సహజ ఔషధంగా ఉపయోగిస్తున్న ఆనవాయితీ ఉంది. మెంతుల్లో పీచు పదార్థం, ఇనుము, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ముఖ్యంగా ఉదయాన్నే నానబెట్టిన మెంతులను తీసుకోవడం వల్ల కడుపు ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. మలబద్ధకం సమస్యను తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. మధుమేహంతో బాధపడేవారికి మెంతులు ఉపయోగకరంగా భావిస్తారు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఇవి సహాయపడతాయని పలు అధ్యయనాలు సూచించాయి. అందుకే చాలామంది మెంతుల నీటిని లేదా మెంతుల పొడిని ఆహారంలో భాగంగా తీసుకుంటున్నారు. జుట్టు సంరక్షణలో కూడా మెంతులకు ప్రత్యేక స్థానం ఉంది. మెంతులను నానబెట్టి పేస్టులా చేసి జుట్టుకు పట్టిస్తే జుట్టు రాలడం తగ్గడంతో పాటు కుదుళ్లు బలపడతాయని చెబుతారు. చుండ్రు సమస్యను తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. అలాగే మెంతులు శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే వారు పరిమిత మోతాదులో మెంతులను ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే ఏ ఆహారమైనా మితంగా తీసుకోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా వంటింట్లో కనిపించే మెంతులు ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా ఉపయోగపడే సహజ వరంగా చెప్పవచ్చు. సరైన పద్ధతిలో, పరిమిత మోతాదులో తీసుకుంటే శరీరానికి మేలు చేసే గుణాలు వీటిలో పుష్కలంగా ఉన్నాయి.



# రోజ్ వాటర్‌తో చర్మానికి సహజ సంరక్షణ

- సహజ సౌందర్యానికి తోడు
- వేసవిలో చర్మానికి ఉపశమనం
- అనేక ప్రయోజనాలు అందించే ద్రావకం

గులాబీ పూల నుంచి తయారయ్యే రోజ్ వాటర్‌ను శతాబ్దాలుగా సౌందర్య సంరక్షణలో ఉపయోగిస్తున్నారు. సహజ సుగంధంతో పాటు చర్మానికి చల్లదనాన్ని అందించే ఈ ద్రావకం నేటికీ అనేక సౌందర్య ఉత్పత్తుల్లో కీలక పదార్థంగా కొనసాగుతోంది. ముఖ్యంగా వేసవి కాలంలో చర్మంపై వేడి ప్రభావాన్ని తగ్గించడంలో రోజ్ వాటర్ ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రోజ్ వాటర్ చర్మానికి సహజ టోనర్‌లా పనిచేస్తుంది. ముఖంపై పేరుకుపోయిన దుమ్ము, మలినాలను తొలగించడంలో ఇది సహాయపడుతుంది. ముఖాన్ని శుభ్రం చేసిన తర్వాత కొద్దిగా రోజ్ వాటర్ రాసుకోవడం వల్ల చర్మం తాజాగా కనిపిస్తుంది. చర్మంలోని సహజ తేమను కాపాడటంలో కూడా ఇది ఉపయోగపడుతుంది.

వేసవిలో ఎండల కారణంగా చర్మం పొడిబారడం, మంటగా అనిపించడం వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తాయి. అలాంటి సందర్భాల్లో రోజ్ వాటర్ చర్మానికి చల్లదనాన్ని అందించి ఉపశమనం కలిగిస్తుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన వెంటనే ముఖంపై రోజ్ వాటర్ స్ప్రే చేసుకుంటే తక్షణ తాజాదనం లభిస్తుంది. మొటిమలు, చర్మ ఎర్రదనం వంటి సమస్యలను తగ్గించడంలో కూడా రోజ్ వాటర్ కొంత మేర సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే సహజ గుణాలు చర్మాన్ని ప్రశాంతంగా ఉంచడంలో తోడ్పడతాయి. అయితే తీవ్రమైన చర్మ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. రోజ్ వాటర్‌ను ముఖానికే కాకుండా కళ్ల అలసట తగ్గించడానికి కూడా ఉపయోగిస్తారు. చల్లటి రోజ్ వాటర్‌లో ముంచిన దూదిని కళ్లపై కొద్దిసేపు ఉంచితే ఉపశమనం లభిస్తుంది. రోజంతా కంప్యూటర్, మొబైల్ తెరలను చూసే వారికి ఇది కొంత ఉపకారం చేస్తుందని చెబుతున్నారు. అయితే మార్కెట్లో లభించే ప్రతి ఉత్పత్తి స్వచ్ఛమైనదే అని భావించకూడదు. నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే ఎంచుకోవడం అవసరం. ఏదైనా అలర్జీ లేదా చర్మ ప్రతిక్రియ కనిపిస్తే వెంటనే వినియోగాన్ని నిలిపివేసి నిపుణులను సంప్రదించడం మంచిది. సరైన విధంగా ఉపయోగిస్తే రోజ్ వాటర్ చర్మ ఆరోగ్యానికి, సహజ సౌందర్యానికి మంచి మిత్రుడిగా నిలుస్తుంది.

# గ్యాస్ ఆదా చేసే చిట్కాలు

- చిన్న జాగ్రత్తలతో పెద్ద పొదుపు
- వంటింట్లో ఖర్చు తగ్గించే మార్గాలు
- ప్రతి ఇంటికి ఉపయోగపడే సూచనలు

వంటగ్యాస్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో గ్యాస్‌ను ఆదా చేసుకోవడం ప్రతి కుటుంబానికి అవసరంగా మారింది. కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా గ్యాస్ వినియోగాన్ని తగ్గించి ఖర్చును నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వంట ప్రారంభించే ముందు కావాల్సిన అన్ని పదార్థాలను సిద్ధంగా ఉంచుకోవడం మంచిది. కూరగాయలు కడగడం, తరగడం, మసాలా దినుసులు సిద్ధం చేయడం వంటి పనులను ముందుగానే పూర్తి చేస్తే స్టవ్‌ను అనవసరంగా ఎక్కువసేపు వెలిగించాల్సిన అవసరం ఉండదు. దీంతో గ్యాస్ వినియోగం తగ్గుతుంది. వంట చేసేటప్పుడు పాత్రపై మూత పెట్టడం చాలా ముఖ్యమైన అలవాటు. మూత పెట్టడం వల్ల వేడి బయటకు పోకుండా ఉండి ఆహారం త్వరగా ఉడుకుతుంది. ముఖ్యంగా పప్పులు, కూరలు, అన్నం వండేటప్పుడు ఈ పద్ధతి గ్యాస్ ఆదాకు బాగా ఉపయోగపడుతుంది. ప్రెజర్ కుక్కర్‌ను ఎక్కువగా ఉపయోగించడం ద్వారా కూడా గ్యాస్‌ను ఆదా చేయవచ్చు. సాధారణ పాత్రలతో పోలిస్తే కుక్కర్‌లో ఆహారం వేగంగా ఉడుకుతుంది. దీంతో వంట సమయం తగ్గి గ్యాస్ వినియోగం కూడా గణనీయంగా తగ్గుతుంది. స్టవ్ మంట పాత్ర అడుగు భాగాన్ని మాత్రమే తాకేలా ఉండాలి. పెద్ద మంట పెట్టడం వల్ల వేడి పక్కలకు వృథాగా వెళ్లిపోతుంది. అలాగే స్టవ్ బర్నర్లను తరచూ శుభ్రం చేయడం ద్వారా మంట సరిగా వెలిగి గ్యాస్ సమర్థవంతంగా వినియోగించబడుతుంది. చిన్న చిన్న అలవాట్లతోనే గ్యాస్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. సరైన ప్రణాళికతో వంట చేయడం, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గ్యాస్ ఖర్చును తగ్గించడమే కాకుండా కుటుంబ బడ్జెట్‌కు కూడా ఊరట కల్పించవచ్చు.





# బచ్చలికూరలో బలానికి బాట

- పోషకాలతో నిండిన ఆకుకూర
- జీర్ణక్రియకు సహజ మిత్రం
- ఆరోగ్యాన్ని కాపాడే బచ్చలికూర

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు విస్తృతంగా ఉపయోగించే ఆకుకూరల్లో బచ్చలికూర ఒకటి. రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఈ ఆకుకూరలో అనేక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. తరచూ ఆహారంలో బచ్చలికూరను చేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బచ్చలికూరలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే విటమిన్ ఎ, విటమిన్ సి వంటి పోషకాలు కూడా లభిస్తాయి. రక్తహీనత సమస్యను తగ్గించడంలో ఈ ఆకుకూర సహాయపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో రక్తం ఉత్పత్తి కావడానికి అవసరమైన పోషకాలను అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ఆకుకూరలో ఉండే పీచు పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మలబద్ధకం సమస్యతో బాధపడేవారికి బచ్చలికూర మంచి ఆహారంగా పరిగణిస్తారు. కడుపు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఇది సహజంగా తోడ్పడుతుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఎముకల ఆరోగ్యానికి అవసరమైన కాల్షియం బచ్చలికూరలో సమృద్ధిగా లభిస్తుంది. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ఈ ఆకుకూరను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా అదనపు ప్రయోజనాలు పొందవచ్చు. శరీరానికి బలం, శక్తిని అందించడంలో కూడా ఇది సహాయపడుతుంది. బచ్చలికూరలో ఉండే ప్రతిఆక్సీకరణ గుణాలు శరీరంలోని కణాలను రక్షించడంలో తోడ్పడతాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలను అందించే ఈ ఆకుకూరను వారంలో పలుమార్లు ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రకృతి ప్రసాదించిన పోషకాల నిలయమైన బచ్చలికూరను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చు. రుచికరమైన వంటకాలతో పాటు ఆరోగ్య రక్షణను అందించే ఈ ఆకుకూర ప్రతి ఇంటి వంటగదిలో ఉండాల్సిన ముఖ్యమైన ఆహార పదార్థంగా నిలుస్తోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# మెగా సినిమాలో నారా రోహిత్ ?


మెగాస్టార్ చిరంజీవి - బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతుంది. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమా పై ఓ క్రేజీ అప్ డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా సినిమా క్లైమాక్స్ లో ఓ గెస్ట్ రోల్ ఉందని.. ఆ రోల్లో మరో హీరో కనిపించబోతున్నాడని.. ఆ హీరో నారా రోహిత్ అని టాక్ నడుస్తోంది. ఇక ఈ సినిమా సెకండ్ హాఫ్ లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ కోసం మెగాస్టార్ సరికొత్త లుక్ లో కనిపించబోతున్నాడు. పైగా ఈ సినిమాలో చిరు పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయట. అలాగే, ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కాగా గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది.



# ‘జటాయు’తో దిల్ రాజు రిస్క్..?

స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో ‘జటాయు’ అనే మైథలాజికల్ ఫాంటసీ చిత్రాన్ని రూపొందించేందుకు రెడీ అవుతున్నారు. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి గత రెండేళ్లుగా ఈ కథపై వర్క్ చేస్తున్నాడు. మొదట విజయ్ దేవరకొండ చేయాల్సిన ఈ ప్రాజెక్ట్‌లోకి, ఆయన డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో యువ హీరో రోషన్ మేకా ఎంట్రీ ఇచ్చాడు. ఈ ఏడాది దసరా తర్వాత ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. దర్శకుడు ఇంద్రగంటికి ఈ మధ్య కాలంలో సరైన హిట్ లేదు, అలాగే రోషన్ ఇంకా కెరీర్ ఆరంభంలోనే ఉన్నాడు. అయినప్పటికీ, రిస్క్‌ను లెక్కచేయకుండా కథపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు ఈ సినిమాపై భారీ బడ్జెట్ పెడుతున్నారు. తన జడ్జ్‌మెంట్‌తో ఈసారి కూడా పెద్ద విజయం అందుకోవాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. మరోవైపు, దిల్ రాజు నిర్మాణంలో ఉన్న విజయ్ దేవరకొండ ‘రౌడీ జనార్దన్’, దేవిశ్రీ ప్రసాద్ ‘ఎల్లమ్మ’, ఆశిష్ రెడ్డి ‘దేత్తడి’ చిత్రాలు 2027 వేసవి లోపే విడుదల కానున్నాయి. అలాగే సల్మాన్ ఖాన్ - వంశీ పైడిపల్లి చిత్రం కూడా ఇటీవలే పట్టాలెక్కింది.

# భార్యల బాధలకు దేవేంద్రుడి పరిష్కారం..!




ఓటీటీ ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తిన ప్రముఖ హాస్య ధారావాహిక ‘సేవ్ ది టైగర్స్’ఇప్పుడు మూడో సీజన్‌తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రెండు భాగాలతో విశేష ఆదరణ పొందిన ఈ సిరీస్, ఈసారి మరింత వినోదం, కొత్త కథా మలుపులు, ఊహించని ఫాంటసీ అంశాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జూన్ 19 నుంచి ప్రముఖ డిజిటల్ వేదికలో ప్రసారం కానున్న ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రచార చిత్రాన్ని తాజాగా విడుదల చేయగా, అది సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది. అయితే ఈ సీజన్‌లో ప్రత్యేకత ఏమిటంటే ఫాంటసీ అంశాల కలయిక. ఒక సందర్భంలో స్వర్గలోకంలోని దేవేంద్రుడి పాత్రలో ప్రముఖ హాస్య నటుడు వెన్నెల కిషోర్ కనిపించడం కథకు కొత్త మలుపును తీసుకువచ్చింది. అతని ప్రవేశం తర్వాత ముగ్గురు స్నేహితుల జీవితాలు పూర్తిగా మారిపోతాయి. సాధారణ జీవితాన్ని గడుపుతున్న వారు ఒక్కసారిగా సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడం కథలో ప్రధాన ఆసక్తికర అంశంగా మారింది .ఈ ధారావాహికను ప్రముఖ దర్శకుడు మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం రూపొందించగా, శ్రీరామ్ ఎరగం దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. కుటుంబ ప్రేక్షకులను, యువతను ఒకేసారి ఆకట్టుకునేలా కథను మలిచిన విధానం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ప్రచార చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి.గత రెండు సీజన్లు డిజిటల్ వేదికలో సంచలన విజయాలు నమోదు చేసిన నేపథ్యంలో, మూడో సీజన్ కూడా అదే స్థాయిలో ఆదరణ పొందుతుందనే నమ్మకంతో నిర్మాతలు ఉన్నారు. హాస్యం, కుటుంబ అనుబంధాలు, ఫాంటసీ అంశాల సమ్మేళనంగా రూపొందిన ఈ సిరీస్ మరోసారి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేందుకు సిద్ధమవుతోంది. జూన్ 19 నుంచి ప్రారంభమయ్యే ఈ కొత్త ప్రయాణం ఓటీటీ ప్రపంచంలో మరో విజయగాథగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ‘నో’ చెప్పడం నేర్చుకోవాలి :యామీ గౌతమ్



బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్ తాజాగా మాతృత్వ దశ తన జీవితాన్ని మార్చివేసింది అంటూ చెప్పుకొచ్చింది. ‘ఆర్టికల్ 370’, ‘హక్’ లాంటి శక్తిమంతమైన కథలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ బ్యూటీ.. ఇటీవలే ‘ధురంధర్ 2’లో అతిథి పాత్రలో మెరిసింది. ప్రస్తుతం ‘నయా నవేలి’ అనే సినిమాతో బిజీగా ఉంది. ఐతే, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో యామి మాట్లాడుతూ--- ‘ఇటీవలే నేను బాబుకి జన్మనిచ్చాను. నేను తల్లి కావడం నా జీవితంలో గొప్ప మలుపు. ఐతే, నా వృత్తిపరమైన ఎంపికలను నా మాతృత్వ దశ ఏ మాత్రం ప్రభావితం చేయలేదు’ అని యామీ చెప్పుకొచ్చింది. యామీ గౌతమ్ ఇంకా మాట్లాడుతూ.. ‘నిజానికి మాతృత్వం అనేది గొప్ప భావోద్వేగం. ఇక సినీరంగంలో నా దశాబ్దాల కెరీర్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ఎదుగుదలకు.. మనసుకు హత్తుకునే కథలే ముఖ్య కారణం. నా కెరీర్ లో అలాంటి కథలకే నేను ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాను. ఈ క్రమంలో ఎంతో సహనం అవసరం. ప్రధానంగా ‘నో’ చెప్పడం నేర్చుకోవాలి. నా పాత్రలు నన్ను ఆకట్టుకుంటేనే వాటిని అంగీకరిస్తాను. లేదు అంటే నో చెప్పేస్తాను’ అంటూ యామీ తెలిపింది.

# టాలీవుడ్ వర్క్ కల్చర్‌పై జాన్వీ ప్రశంసలు



బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ తెలుగు చిత్ర పరిశ్రమ పనితీరుపై ప్రశంసల వర్షం కురిపించారు. దక్షిణాది చిత్రాల్లో, ముఖ్యంగా తెలుగు సినిమాల్లో నటించిన అనుభవంతో టాలీవుడ్‌లోని పని సంస్కృతి తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆమె వెల్లడించారు. క్రమశిక్షణ, సమయపాలన, పరస్పర గౌరవం, కథలకు ఇచ్చే ప్రాధాన్యం వంటి అంశాలు తెలుగు చిత్ర పరిశ్రమను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవలి ఇంటర్వ్యూలో మాట్లాడిన జాన్వీ కపూర్, తెలుగు సినిమా సెట్లలో ప్రతి విభాగం అత్యంత ప్రొఫెషనల్‌గా పని చేస్తుందని చెప్పారు. షూటింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రతిదీ ముందస్తు ప్రణాళిక ప్రకారం సాగుతుందని, సమయపాలనకు ఇక్కడ అత్యంత ప్రాధాన్యం ఇస్తారని వివరించారు. ఈ క్రమశిక్షణ వల్లే భారీ బడ్జెట్ చిత్రాలు కూడా సజావుగా పూర్తవుతున్నాయని అభిప్రాయపడ్డారు. సెట్స్‌లో నటీనటులు, సాంకేతిక నిపుణులు, దర్శకులు, నిర్మాతలు అందరూ ఒక కుటుంబ సభ్యుల్లా వ్యవహరిస్తారని జాన్వీ పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన నటీనటులకు సహాయం చేయడంలో ఎవరూ వెనుకాడరని, ముఖ్యంగా ఇతర భాషలకు చెందిన కళాకారులు తెలుగు భాష నేర్చుకోవడానికి అందరూ సహకరిస్తారని చెప్పారు. ఈ ఆప్యాయత తనకు ఎంతో ప్రత్యేక అనుభూతిని కలిగించిందని తెలిపారు.

# రికార్డులు సృష్టిస్తున్న మరాఠీ చిత్రం !

మరాఠీ చిత్రం ‘దేవూల్ బంద్ 2’ ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. స్నేహల్ తార్డే, మోహన్ జోషిక కీలక పాత్రల్లో ప్రవీణ్ తార్డే దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ మే 21న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఐతే, కేవలం రూ.9 కోట్లతో రూపొందిన ఈ మూవీ 9 రోజుల్లోనే సుమారు రూ.40 కోట్లు వసూలు చేయడం విశేషం. పైగా అత్యధిక వసూళ్లు సాధించిన టాప్10 మరాఠీ చిత్రాల్లో ఈ సినిమా ఒకటిగా నిలవడం మరో విశేషం. ఇంతకీ, ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సంగీత పేగుడే (స్నేహల్) మహిళా రైతు. కష్టాలతోనే ఆమె సహవాసం. తన బాధలను తీర్చమని రోజూ దేవుడిని వేడుకుంటుంది. కానీ, ఏ ప్రయోజనం ఉండదు. ఒకరోజు తీవ్ర అసహనానికి గురై నది సమీపంలో ఉన్న చీమల పుట్టపై రాయిని విసిరికొడుతుంది. దీంతో ఆమెకు శ్రీస్వామి సమర్థ్ దర్శనమిస్తారు. ఆ తర్వాత స్నేహల్ జీవితంలో ఏం జరిగింది అనేది ఈ కథ. అన్నట్టు ఈ సినిమా కోసం 33 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేశారట.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in